క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పెదకూరపాడు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ బొమ్మ సెంటర్ నుంచి రూ.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్, మాజీ ఎంపీపీ గళ్ల బాబురావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ముంతాజ్, నాయకులు మలాట్ రఫీ, కోటేశ్వరరావు ఉన్నారు.

నేడు మంచి నీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పురపాలక సంఘ హెడ్ వాటర్ వర్క్‌లోని పాత ఫిల్ట్రేషన్ ప్లాంట్‌లో మరమ్మతులు జరుగుతున్నాయి. పట్టణ ప్రజలకు ఆదివారం తాగునీరు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 9వ వార్డు, 11 నుంచి 14వ వార్డు, 19 నుంచి 24వ వార్డు వరకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ నీటి నిల్వలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ఓటు నమోదుకు రేపటి వరకు అవకాశం

ముప్పాళ్ళ: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు సోమవారం వరకు అవకాశం ఉందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులు ఓటు హక్కుకు సంబంధిత ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మద్యం బెల్ట్ షాపులను కట్టడి చేయండి

సత్తెనపల్లి: మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో మద్యం బెల్ట్ షాపులు నడపకుండా చర్యలు తీసుకోవాలి గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో పోటాపోటీగా మద్యం విక్రయాలు జరిపేందుకు మూడు మద్యం బెల్ట్ షాపులను ఏర్పాటు చేశారని, దీంతో నిత్యం గొడవలు చేసుకుంటున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ప్రధానంగా గ్రామంలోని బొడ్రాయి సెంటర్, శివాలయం సెంటర్, ఊరి చివర మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి రాత్రులు పొద్దుపోయే వరకు విక్రయాలు జరుపుతున్నారని, వీటి పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో మద్యం బెల్ట్ షాపులు నడపకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉండండి

తొండపి(ముప్పాళ్ళ): ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉంటే గ్రామాలనువిడిచి వెళ్లాల్సిన అవసరం ఉండదని ఎస్సై వి.సోమేశ్వరరావు చెప్పారు. మండలంలోని తొండపి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేర శనివారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై వి.సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో అలజడులు సృష్టించే వారిపై పోలీసుల నిఘా ఉంటుందని, శాంతి భద్రతలు విఘాతం కలిగించేలా ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించాలన్నారు. గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామకచేరిలో నిద్రకు ఉపక్రమించారు. ఏఎస్సై ఎం.మాధవ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో కొలువులు

- సత్తెనపల్లి నియోజకవర్గంలో 2 అంగన్‌వాడీ కార్యకర్తలు
- 19 ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ, 18వ తేదీ వరకు గడువు



సత్తెనపల్లి సీడీపీఓ కార్యాలయం

సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలో అంగన్ వాడీ కేంద్రాల్లో పనిచేసేందుకు 2 అంగన్‌వాడీ కార్యకర్తలు, 19 ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయని ఐసీడీఎస్ అధికారులు స్పష్టం చేశారు. ఉద్యోగ విరమణ పొందడం, ఉద్యోగం మానేయడం, పలువురు చనిపోవడం.. తదితర కారణాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. దీంతో ఆయా ఖాళీల భర్తీకి ఈ నెల 4న నోటిఫికేషన్ విడు దల చేశారు. ఈనెల 6 నుంచి సత్తెనపల్లిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు లను అందుబాటులో ఉంచారు. ఈ వివరాలను గ్రామ సచివాలయాలతో పాటు సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా తెలుసుకోవచ్చు. ఈ నెల 18 లోపు దర ఖాస్తులు తీసుకొని కార్యాలయంలో అందజేయాలని అధికారులు చెబుతున్నారు.

ఈ కేంద్రాల్లో ఖాళీలు...

రాజుపాలెం మండలం మొక్కపాడు, నకరికల్లు మండలం చాగల్లులో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టులకు సంబంధించి ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెం-1, మాదల బీసీ-1, రుద్రవరం ఓసీ, మాదల ఎస్టీ, రాజుపాలెం మండలం రాజుపాలెం-1, మొక్కపాడు ఓసీ, పెదనెమలిపురి ఎస్టీ, ఇనిమెట్ల బీసీ, నకరికల్లు మండలం దేచవరం ఓసీ-1, చల్లగుండ్ల ఓసీ, కండ్లకుంట-1, గుండ్లపల్లి-5, కుంకలగుంట-1, సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ ఎమ్‌డీ, గర్నెపూడి, గండ్లూరు, ఫణిదం బీసీ, లక్కరాజుగార్లపాడు ఎస్సీ, వెన్నాదేవి ఓసీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయి.

మండలాల వారిగా ఖాళీల వివరాలు

మండలం	కార్యకర్త	ఆయా
సత్తెనపల్లి	–	06
ముప్పాళ్ళ	–	04
రాజుపాలెం	01	04
నకరికల్లు	01	05
మొత్తం	02	19

దరఖాస్తుకు జతచేయాల్సినవి...

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తుతో పాటు ఈ ధృవీకరణ పత్రాల నకళ్ల జత పర్చాలి. నకళ్ల గజిటెడ్ అధికారితో తప్పక అటెస్ట్ చేయించాలి. దరఖాస్తుకు పుట్టిన తేదీ, వయస్సు ధృవీకరణ పత్రం, కుల, విద్యార్హత, నివాస స్థల ధృవీకరణ పత్రం, అదనపు అర్హతలు ఉంటే ఆ పత్రం, పూర్వానుభవం ఉంటే ఆ ధృవపత్రం, వితంతు అయితే భర్త మరణ ధృవీకరణ పత్రం, అనాధలు అయితే అనాధల ధృవీకరణ పత్రం, వికలాంగులు అయితే వికలాంగ శాతం ధృవీకరణ పత్రం, వితంతు అయితే 18 సంవత్సరముల లోపు పిల్లలు ఉన్న యెడల పిల్లల వయస్సు ధృవీకరణ పత్రాలు జత చేయాలి.

అర్హతలు ఇవీ ...

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి అభ్యర్థి తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణురాలై ఉండాలి. అభ్యర్థులు 2024 జూలై 1 నాటికి 21 సంవత్సరాలు వయస్సు నిండి 35 ఏళ్లలోపు వారై ఉండాలి. తప్పనిసరిగా వివాహితురాలై ఉండాలి. స్థానిక నివాసితురాలై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 21 ఏళ్లు నిండిన వారు లేకపోతే..18 ఏళ్లు నిండిన వారిని పరిగణనలోకి తీసుకుంటారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



వెంకటపతి కాలనీలో కావడి ఉత్సవం



నకరికల్లులో కావడి మహోత్సవం



శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సత్తెనపల్లి: పట్టణంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చేశారు. వెంకటపతి కాలనీలో శ్రీలక్ష్మీ ప్రత్యంగిరా పీఠం నందు కావడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పుర వీధుల్లో కావడిని ఎత్తుకొని ఊరేగింపుగా స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. పీఠాధిశ్వరి శ్యామలమ్మ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి

నకరికల్లు: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రీ వల్లిదేవసేన సమేత షణ్ముఖ కుమారస్వామి సుబ్రహ్మణ్య షష్టి శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు తుంగతుర్తి కృష్ణశాస్త్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గో పూజ, 21 విశేష ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు జరిపించారు. శాంతి కల్యాణం కనుల పండువగా జరిపించారు. కావడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వార్లు పోసి మొక్కులు చెల్లించారు.

స్పీడ్ బ్రేకర్‌కు రంగులు

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: ప్రమాదాల నియంత్రణలో భాగంగా పేరేచర్ల-కొండమోడు ప్రధాన రహదారి పరిధిలోని పట్టణంలో హోలీ ఫ్యామిలీ పాఠశాల సమీపంలో రహదారిపై స్పీడ్ బ్రేకర్‌కు పసుపు రంగు వేశారు. ఇది గ్రహించక అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో గత నెల 14న సాక్షి దినపత్రికలో 'పీక్‌కు చేరిన 'పచ్చ' ప్రచారం' శీర్షికతో ప్రచురించిన కథనానికి పాలకులు, అధికారులు స్పందించారు. స్పీడ్ బ్రేకర్‌కు పసుపు పచ్చ రంగు తొలగించి అందరూ స్పీడ్ బ్రేకర్ గుర్తించేలా నలుపు, తెలుపు రంగులు వేశారు.



స్పీడ్‌బ్రేకర్‌కు వేసిన నలుపు తెలుపు రంగులు

రాకపోకల ఇక్కట్లు తీర్చండి మహాప్రభో!



పట్టణంలోని నందిగామ డొంకలో సగంలో ఉన్న కల్వర్టు పనులు



పొంచి ఉన్న ప్రమాదం

సత్తెనపల్లి: పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని నందిగామ డొంకలో కల్వర్టు నిర్మాణం పనులు ప్రారంభించి నెలన్నర దాటింది. సగం పనులు పూర్తిచేసి వదిలేయడంతో ఆ కల్వర్టుపై నుంచి రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహన దారులు వాహనాలతో వెళ్లాలంటే ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి రాకపోకలు సాగించటానికి కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి మహాప్రభో అంటూ ఆ ప్రాంతవాసులు వేడుకుంటున్నారు.

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి

బెల్లంకొండ: పోలీస్ స్టేషన్ వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ కేసులు లేకుండా చూడాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం. హనుమంతరావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను తెలుసుకున్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఎస్ఐ ప్రవీణ్‌కు సూచించారు. ప్రతి గ్రామంపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటు సారా తయారీ, విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. స్టేషన్లో పలు అంశాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం స్టేషన్ పరిసరాలను, క్వార్టర్స్ ను పరిశీలించారు. ఆయన వెంట పెదకూరపాడు సీఐ సురేష్, ఎస్ఐ డి.ప్రవీణ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బంధం మరింత ధృడం



నందిగామలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



క్రోసూరు మోడల్‌స్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న తల్లులు



పెదకూరపాడులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



అచ్చంపేట పాఠశాలలో మాట్లాడుతున్న కేజీబీవీ కార్యదర్శి దేవానందరెడ్డి

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, 2047కి వికసిత్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించి నట్లు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని సుగాలి హైస్కూల్, నందిగామ పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్- టీచర్ మీటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల మధ్య దృఢమైన బంధాన్ని ఏర్పరచడానికి ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. సమాజ భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందని, విద్యాభివృద్ధిలో కూడా సమాజం కీలక భాగస్వామి కావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పాఠశాల యాజమాన్య కమిటీలకు సహకారం అందిస్తానన్నారు. అభ్యసనా సామర్థ్యాల్లో రాబోయే ఐదేళ్లలో ఫైవ్ స్టార్ రేటింగ్‌లో నిలిపేందుకు కలిసి పనిచేద్దామన్నారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. ప్రతిభావతులైన క్రీడాకారులకు మెడల్స్ బహూకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సత్తెనపల్లి: పట్టనంలోని 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి హ్యారీస్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. హెచ్‌ఎం సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యా కమిటీ చైర్మన్ వల్లెపు అంకమ్మరావు, ఎక్స్ అఫిషియో కాకి రాజారావు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యమివ్వాలని ఆయన సూచించారు. అనుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ వెంకట కృష్ణకుమార్ హెల్త్ కార్డులను అందజేశారు. కేజీబీవీలో మండల ప్రత్యేక అధికారి ఉషారాణి, గణపవరం ఉన్నత పాఠశాలలోఎంపీడీవో జీవీ సత్యనారాయణ, రాజుపాలెం పాఠశాలలో తహసీల్దారు దుర్గేష్‌రావు, పెదనెమలిపురి పాఠశాలలో ఎంఈవో-1 మల్లికార్జునశర్మ, అనుపాలెం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 నరసింహారావు, ఎస్ఐ వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు పాల్గొన్నారు.

అమరావతి: మండల పరిధిలోని మునగోడు జెడ్పీ, బాలికల గురుకుల పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు జరిగాయి. ఎంపీపీ మేకల హనుమంతరావు, మండల విద్యాశాఖాధికారి శివబాబు పాల్గొని, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. దమ్మాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రమణ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో రామకృష్ణ పాల్గొని, మాట్లాడారు. తల్లిదండ్రులు నెలకోసారి పాఠశాలను సందర్శించి, తమ పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా అర్తిమళ్ల రమేష్, గల్లా బాబురావు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, మైనార్టీ నాయకురాలు షేక్ ముంతాజ్, ఏఎస్ఐ నాగేశ్వరరావు పేరెంట్స్ కమిటీ చైర్మన్ హిదాయితుల్లా, వైస్ చైర్మన్ కంచర్ల విజయ కుమారి, ఉపాధ్యాయులు నాగరాజు, ఆర్కే, సాంబశివరావు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అచ్చంపేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెచ్‌ఎం చిగురుపాటి కల్యాణి, పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

అచ్చంపేట: స్థానిక కేజీబీవీలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కేజీబీవీ సంస్థ కార్యదర్శి డి.దేవానందరెడ్డి పాల్గొన్నారు. సభకు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జోత్స్నా దేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, నందిగం ఆశీర్వాదం పాల్గొన్నారు.

క్రోసూరు: క్రమశిక్షణతో కూడిన శ్రద్ధాశక్తులు విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేరుస్తాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. క్రోసూరు ఆదర్శ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపల్ మేరీసుజన్ అధ్యక్షత వహించారు. తల్లిదండ్రులు ప్రతి నెలా జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు హాజరై తమ పిల్లల పురోగతి తెలుసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డ్స్ అందచేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు బస్సు సౌకర్యం కావాలని కోరగా.. వెంటనే ఆర్టీసీ అధికారలతో ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడారు. పాఠశాలకు అప్రోచ్ రోడ్డు వేయిస్తామన్నారు. విద్యార్థులకు రంగోలి, టగ్‌ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీలా బేగం, ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, గణేష్, పేరంట్స్ కమిటీ చైర్మన్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ, జెడ్పీ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ-2 ఎంఎల్‌ఎం ప్రసాద్, ఎస్ఐ చల్లా సురేష్, మండల ప్రత్యేకాధికారి బాలూ నాయక్ గ్రామకార్యదర్శి కె.వి.శివప్రసాద్ పాల్గొన్నారు.

బెల్లంకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్' కార్యక్రమాలను నిర్వహించారు. మాచయపాలెం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో వై హనుమారెడ్డి పాల్గొన్నారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. బెల్లంకొండ జెడ్పీ పాఠశాలలో ఎంఈఓ బాలసుందరరావు పాల్గొని ప్రసంగించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ సముద్రం, జెడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు మహాలక్ష్మి, శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు గ్రాసం సాగుకు ప్రోత్సాహం

- ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయింపు
- 100 శాతం సబ్సిడీతో 10 నుంచి 50 సెంట్లలో సాగుకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు అర్హులు



సాగులో ఉన్న సూపర్ నేపియర్ పశు గ్రాసం

బెల్లంకొండ: గ్రామాల్లో పశుగ్రాసం కొరతను నివారించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాసం సాగు చేసేందుకు అవకాశం కల్పించింది. వంద శాతం సబ్సిడీతో బహు వార్షిక పశు గ్రాసాల సాగుకు రైతులను ప్రోత్సహించడమే ధ్యేయంగా పెట్టుకుంది. ఈ మేరకు రైతులు 10 నుంచి 50 సెంట్లలో పశుగ్రాసం సాగు చేసుకునేందుకు మార్గదర్శకాలను జారీ చేసింది.

వీరు అర్హులు..

బహు వార్షిక పశు గ్రాసాల సాగు పథకానికి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉండాలి. ఐదు ఎకరాల లోపు పొలం ఉన్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతో పాటు సన్న, చిన్న కారు రైతులు అర్హులు. దరఖాస్తుతో పాటు ఉపాధి జాబ్ కార్డు, 1బీ, ఆధార్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డ్ జిరాక్స్‌లు సమర్పించాల్సి ఉంటుంది.

వంద శాతం రాయితీ..

- పశుగ్రాసం 10 సెంట్లలో సాగు చేసేందుకు మొత్తం ఖర్చు రూ. 6,599 అవుతుంది. ఇందులో లేబర్ కాంపోనెంట్ కింద 3 వేలు, విత్తనం, ఇతర ఖర్చుల కింద మెటీరియల్ కాంపానెంట్ రూ.3,599 చెల్లిస్తారు.
- 20 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు 6 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.7,197తో కలిపి మొత్తం రూ.13,197 ఇస్తారు.
- 30 సెంట్లకు లేబర్‌కి రూ.9వేలు, మెటీరియల్‌కు రూ.10,795తో కలిపి మొత్తం రూ.19,795 ఇస్తారు.
- 40 సెంట్లకు లేబర్ ఖర్చు రూ.12 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.14,394 తో కలిపి రూ.26,394 చెల్లిస్తారు.
- 50 సెంట్లకు లేబర్ ఖర్చు రూ.15వేలు, మెటీరియల్ ఖర్చు రూ.17,992, మొత్తం రూ.32,992 నగదు ఉపాధి నిధుల నుంచి చెల్లిస్తారు.

సూపర్ నేపియర్ రకం అనుకూలం

బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సూపర్ నేపియర్ రకం ముఖ్యమైనది. ఈ రకం గడ్డి ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుకూలం. అన్ని రకాల నేలల్లో, కాలల్లో సాగు చేయవచ్చు. సారవంతమైన నేలల్లో అధిక దిగుబడి వస్తుంది. 50 సెంట్ల భూమిలో ఏడాదికి వంద టన్నుల వరకు పశుగ్రాసం వస్తుంది. 8 ఏళ్ల వరకు పశు గ్రాసం వస్తుంది. పది రోజులకు ఒకసారి నీటి తడులు అందించాల్సి ఉంటుంది.

ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఆసక్తి గల రైతులు పూర్తి వివరాలకు పశు సంవర్ధక సిబ్బందిని సంప్రదించాలి. దరఖాస్తుతో పాటు సంబంధిత పత్రాలను జత చేసి అందజేయాలి. మేలైన గడ్డి రకాల ఎంపికతో అధిక దిగుబడి పొందవచ్చు.

– డా.బాలకృష్ణారెడ్డి, పశు వైద్యాధికారి, బెల్లంకొండ

ఓటరు జాబితాలో సవరణలకు అవకాశం

బెల్లంకొండ: కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని మండల తహసీల్దార్ అష్రపున్నీసా బేగం తెలిపారు. శనివారం ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాను స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రచురించామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఓటర్లు దరకాస్తు సోమవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అమరావతి: శరీరం కాలి చికిత్స పొందుతున్న వృద్ధురాలు మరణించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..అత్తలూరు గ్రామానికి చెందిన వేముల రామసుబ్బులు(68)శనివారం సాయంత్రం తన గుడిసెలో మంచం సమీపంలో కొవ్వొత్తి వెలిగించి, ప్రార్థన చేసుకుంది. అనంతరం కొవ్వొత్తి ఆర్పకుండా నిద్రకు ఉపక్రమించింది. దీంతో మంచం నవారు కాలి ఆమె చీరకు, గుడిసెకు నిప్పంటుకుంది. మంటలు చెలరేగడంతో.. ఆమె కోడలు కేకలు వేసింది. చుట్టు పక్కల వారు వచ్చి మంటలు ఆర్పారు. తీవ్రంగా గాయపడిన రామసుబ్బులును చికిత్స నిమిత్తం సాధనిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం గుంటూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామసుబ్బులు మరణించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.